RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 335 సోమవారం 07 - 07 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## ఇన్ని ఇళ్లు ఇచ్చిన చరిత్ర ఎక్కడా లేదు

- ఖమ్మం జిల్లా మధిరలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ
- ఈ ఏడాది రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడి
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఎలాంటి మేలు జరగలేదని విమర్శ
- మధిరలో రూ.6.45 కోట్లతో ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పేద ప్రజల సొంతింటి కలను తమ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం తన సొంత నియోజకవర్గమైన ఖమ్మం జిల్లా మధిరలో పర్యటించిన ఆయన, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. - మిగతా 2 లో

## తెలంగాణలో యూరియా కొరతపై విచారణ జరపాలి



కేటీఆర్ డిమాండ్

- తెలంగాణలో తీవ్రమైన యూరియా కొరత
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- బ్లాక్ మార్కెట్‌పై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్
- యూరియా బస్తా ధర రూ.325కు పెరిగిందని ఆరోపణ
- కేంద్రం నుంచే సరఫరాలో లోటు జరిగిందంటున్న రాష్ట్ర ప్రభుత్వం

## ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా 20 వేల సైకిళ్ల పంపిణీ



- తెలంగాణలోని విద్యార్థులకు భారీ శుభవార్త
- రూ. 4 వేల విలువైన సైకిల్ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ
- 1న బండి సంజయ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ

పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. రూ. 4 వేల విలువైన సైకిల్ విద్యార్థులకు ఉచితంగా అందనుంది. మరి ఏ జిల్లాల వారికి ఈ సైకిళ్లు అందుతాయి. ఎవరెవరికి ఈ సైకిళ్లు అందుతాయో ఇక్కడ తెలుసుకోండి.కేంద్ర హోంశాఖ- మిగతా 2 లో


## శ్యామా ప్రసాద్ ముఖర్జీ లేకుంటే కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగా ఉండేది కాదు

- గుజరాత్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు
- జమ్ముకశ్మీర్ కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలను స్మరించుకున్న అమిత్ షా
- జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే భారత రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌ను శ్యామా ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు



భారతీయ జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ లేకపోతే కశ్మీర్ భారత్‌లో కలిసేది కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఆదివారం ఆయన జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఆనంద్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ దేశానికి ముఖ్యంగా జమ్ముకశ్మీర్ కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలను స్మరించుకున్నారు.జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే భారత రాజ్యాంగంలోని 370 ఆర్టికల్‌ను శ్యామా ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. కశ్మీర్‌కు స్వయంతప్రతిపత్తి కల్పించకుండా భారత్‌లోనే పూర్తిగా విలీనం చేయాలని వాదించారు. 901లో బంగాల్‌లో పుట్టిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ గొప్ప జాతీయవాద నాయకుడు. దేశ ప్రజలు ఆయనను జమ్ముకశ్మీర్?తో అనుసంధానిస్తున్నారు. అది నిజమే ఎందుకంటే - మిగతా 2 లో

## టెక్నాలజీతో కొత్త ముప్పు మీ మెదడును హ్యాక్ చేయొచ్చు!



- మెదడును హ్యాక్ చేయడం సైన్స్ ఫిక్షన్ కాదని హెచ్చరిస్తున్న నిపుణులు
- బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ) టెక్నాలజీతో కొత్త ముప్పులు
- మెదడు నుంచి వచ్చే సిగ్నల్స్ దొంగిలించి ఆలోచనలు తెలుసుకునే ప్రమాదం
- మానసిక స్వేచ్ఛను కాపాడేందుకు 'కాగ్నిటివ్ లిబర్టీ' హక్కు అవసరమన్న వాదన
- మెదడుకు సైబర్ భద్రత కల్పించేందుకు వస్తున్న 'న్యూరోసెక్యూరిటీ' రంగం

## ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు చంద్రబాబు సర్కార్ శుభవార్త!

- ఏపీలో మహిళా ఉద్యోగుల పిల్లల కోసం
- చంద్రబాబు అదిరిపోయే శుభవార్త!
- 216 ప్రాంతాలలో క్రెష్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ప్రభుత్వ భవనాలలోనే నిర్వహణకు ఏర్పాట్లు
- మహిళా ఉద్యోగుల కోసం పని ప్రదేశాలలో క్రెష్‌లు ఏర్పాటు
- మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ నిర్ణయంతో సంతోషం
- ఏపీ ప్రభుత్వం క్రెష్ ల ఏర్పాటుకు కేంద్ర సహాయాన్ని కోరుతుంది



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీలో పని చేసే ప్రభుత్వ మహిళా ఉద్యోగుల కోసం శుభవార్త చెప్పబోతోంది. ఉద్యోగం చేసే మహిళలు పిల్లల అలనా పాలనా చూసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని భావించిన చంద్రబాబు సర్కార్ మహిళలకు ఇకపై ఆ ఇబ్బంది లేకుండా ఉండేలా ఏర్పాట్లు చేయబోతోంది. మహిళలకు శుభవార్త చెప్పనున్న చంద్రబాబు సర్కార్ మహిళలు ఇటు జాబ్ ను అటు పిల్లల అలనా పాలనను చూసుకోవడానికి ఇబ్బంది పడుతున్న క్రమంలో, ఈ మెంటల్ స్ట్రెస్ నుండి మహిళలకు విముక్తి కల్పించాలని నిర్ణయించిన ఏపీ సర్కార్ పని ప్రదేశాలలో క్రెష్ లను, చిన్నారుల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసి వారికి ఆ ఇబ్బంది నుండి విముక్తి కల్పించాలని నిర్ణయించింది. ఇక ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసింది. 216 ప్రాంతాలలో క్రెష్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రాష్ట్రవ్యాప్తంగా 216 ప్రాంతాలను గుర్తించి అక్కడ క్రెష్ లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్ర సహకారం కోసం ప్రతిపాదనలను పంపించింది. మహిళా ఉద్యోగులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలలో క్రెష్ లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తుంది. ప్రభుత్వ భవనాలలోనే నిర్వహణకు ఏర్పాట్లు వంద మంది కంటే ఎక్కువ ఆడవారు పని చేసే చోట క్రెష్ లు ఏర్పాటు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం - మిగతా 2 లో

## బ్రిక్స్ సదస్సు కోసం బ్రెజిల్ చేరుకున్న ప్రధాని మోదీ



బ్రిక్స్ దేశాల 17వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు బ్రెజిల్ వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి అక్కడ ఒక అపూర్వ, ఆధ్యాత్మిక స్వాగతం లభించింది. రియో డి జనీరో నగరంలో విమానం దిగిన ప్రధానికి, స్థానిక సంగీత కళాకారులు 'ఓం గం గణపతయే నమః' అనే సంస్కృత గణేశ మంత్రాన్ని ఆలపించి ఘనంగా స్వాగతం పలికారు.భారతీయ సంప్రదాయ సంగీతానికి బ్రెజిల్ సంగీత శైలిని జోడించి, అక్కడి గాయనీగాయకులు ఈ మంత్రాన్ని అద్భుతంగా ఆలపించారు. ఈ ప్రదర్శనను చూసి ప్రధాని మోదీ ఎంతో ముగ్ధులయ్యారు. ఆయన చేతులు జోడించి, చిరునవ్వుతో నిలుచుండిపోయారు. ఈ ఆధ్యాత్మిక స్వాగతం భారత సాంస్కృతిక వారసత్వం ప్రపంచవ్యాప్తంగా ఎంతగా విస్తరిస్తోందో తెలియజేసింది.కార్యక్రమం ముగిశాక, ప్రధాని మోదీ స్వయంగా ఆ కళాకారులను కలిసి అభినందించారు. ప్రతి ఒక్కరితో - మిగతా 2 లో

- బ్రెజిల్‌లో మోదీకి ఆధ్యాత్మిక స్వాగతం
- గణేశ మంత్రంతో స్వాగతం పలికిన కళాకారులు
- రియోలో 'ఓం గం గణపతయే నమః' మంత్రంతో ఘన స్వాగతం
- స్థానిక కళాకారుల ప్రదర్శనకు ప్రధాని మోదీ ముగ్ధులు
- ప్రతి కళాకారుడినీ అభినందించిన ప్రధాని
- మోదీని కలవడం జీవితంలో మర్చిపోలేమన్న కళాకారులు
- నాలుగు రోజుల పాటు బ్రెజిల్‌లో కొనసాగనున్న ప్రధాని పర్యటన

## మొదటిపేజీ తరువాయి

# ఇన్ని ఇళ్లు ఇచ్చిన చరిత్ర ఎక్కడా లేదు



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే రూ.22,500 కోట్ల భారీ బడ్జెట్‌తో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని భట్టి తెలిపారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఒకేసారి ఇన్ని గృహాలు కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదల కోసం ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. తాము రైతు భరోసా కోసం రూ.17,500 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు.ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ, రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగుల కోసం రూ.8 వేల కోట్లతో 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని, డ్వాక్రా మహిళలకు రూ.లక్ష కోట్లతో రుణ సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని భట్టి విక్రమార్క వెల్లడించారు.అనంతరం, మధిర పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ.6.45 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంబారుపేట పెద్ద చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంతో పట్టణానికి కొత్త శోభ వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో యూరియా కొరతపై విచారణ జరపాలి



తెలంగాణలో తీవ్రమైన ఎరువుల కొరత నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో యూరియాను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు. "సబ్సిడీపై రూ.266.50కి లభించాల్సిన యూరియా బస్తా ధర, ఇప్పుడు రూ.325కి ఎందుకు పెరిగింది? దీనికి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, ప్రజలకు సమాధానం చెప్పాలి" అని ప్రశ్నించారు. ఈ కృత్రిమ కొరతను ఎవరు సృష్టిస్తున్నారు? తెర వెనుక ఉండి ఈ బ్లాక్ మార్కెట్ దందాను నడిపిస్తున్నదెవరు? అని నిలదీశారు. ఆధార్ కార్డు తప్పనిసరి చేసినా రైతులకు కనీసం ఒక్క బస్తా యూరియా కూడా ఇవ్వలేని దుస్థితి ఎందుకొచ్చిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ వంటి హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు.మరోవైపు, ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. రాష్ట్రంలో 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఈ విషయంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత వారమే కేంద్రానికి లేఖ రాశారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు గాను తెలంగాణకు 5 లక్షల టన్నుల యూరియాను కేటాయించిన కేంద్రం, కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. తక్షణమే మిగిలిన కోటాను విడుదల చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను కోరారు. అలాగే, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు కూడా లేఖలు రాసి, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బ్రిక్స్ సదస్సు కోసం బ్రెజిల్ చేరుకున్న ప్రధాని మోదీ



కరచాలనం చేసి, వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. "ప్రధాని మా ప్రదర్శనను ఇంతగా ఆస్వాదించడం మాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆయన మమ్మల్ని వ్యక్తిగతంగా కలవడం ఎప్పటికీ మరిచిపోలేం" అని కళాకారులు తమ సంతోషాన్ని పంచుకున్నారు.ప్రధాని మోదీ బ్రెజిల్‌లో నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఆయన అర్జెంటీనా నుంచి ఇక్కడికి చేరుకున్నారు. రియోలో జరిగే బ్రిక్స్ సదస్సు అనంతరం, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా ఆహ్వానం మేరకు రాజధాని బ్రసీలియాలో పర్యటిస్తానని ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు కూడా సభ్యులుగా ఉన్న సంగతి తెలిసిందే.

# ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు చంద్రబాబు సర్కార్ శుభవార్త!

మొదటిపేజీ తరువాయి



అన్ని ప్రభుత్వ విభాగాల కార్యాలయాల వద్ద వీటిని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించింది. సాధ్యమైనంతవరకు ప్రభుత్వ భవనాలలోనే వీటిని నిర్వహించటానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. మహిళా ఉద్యోగులకు చంద్రబాబు హామీ ఏపీ సీఎం చంద్రబాబు కొంతకాలం క్రితం మహిళా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా మహిళా ఉద్యోగులు కుటుంబ జీవితాన్ని, ఇటు ఉద్యోగ జీవితాన్ని రెండింటిని బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుందని, పిల్లల్ని పెంచే బాధ్యత మహిళల పైనే ఉంటుంది కాబట్టి, వారి విషయంలో మహిళలకు ఉన్న ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని వారి కష్టాలను తొలగించడం కోసం పని ప్రదేశాలలో క్రెష్ లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అమరావతిలో నిర్వహిస్తున్న క్రెష్ ఇందులో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ వీటిని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేసి వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతి సచివాలయంలో ఒక క్రెష్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఆరు నెలలు పైబడిన పిల్లలను చూసుకుంటారు. పిల్లల సంరక్షణ కోసం ఒక కార్యకర్త, ఒక సహాయకురాలు ఉంటారు. అన్ని వసతులు అక్కడ ఉంటాయి. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ నిర్ణయంతో సంతోషం ఇక తల్లిదండ్రులు తెచ్చి ఇచ్చిన ఆహారాన్ని అక్కడ పిల్లలకు తినిపిస్తారు. సాయంత్రం ఉద్యోగం అయిపోయిన తర్వాత తల్లులు తమ పిల్లల్ని తీసుకుని ఇళ్లకు వెళ్తారు. ఇదే విధానంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రతిచోట క్రెష్ లు ఏర్పాటు చెయ్యాలని ఏపీ ప్రభుత్వం భావిస్తుంది. అందుకు కేంద్ర సహాయాన్ని కోరుతుంది. ఇక ఈ నిర్ణయం పట్ల మహిళా ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# శ్యామా ప్రసాద్ ముఖర్జీ లేకుంటే కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగా ఉండేది కాదు




మొదటిపేజీ తరువాయి

ఆయన లేకపోతే కశ్మీర్ భారత్‌లో అంతర్భాగంగా ఉండేది కాదు. ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహీ ఛాలెంగే అంటూ నినాదాలు చేస్తూ కశ్మీర్? కోసం తన ప్రాణాలను అర్పించారు. అలాగే బెంగాల్ ఈ రోజున భారత్?లో భాగంగా ఉండటానికీ కూడా శ్యామా ప్రసాద్ ముఖర్జీ, స్వామి ప్రణవానందకే పూర్తి క్రెడిట్ చెందుతుంది' అని అమిత్ షా అన్నారు.ఇక 10 మందితో ప్రారంభించిన భారతీయ జనసంఘ్ ఇప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని అమిత్? షా పేర్కొన్నారు. మాజీ ప్రధాని జవహర్?లాన్ నెహ్రూ మంత్రివర్గాన్ని బుజ్జగించే విధానానికి నిరసనగా ఆయన రాజీనామా చేశారు. ఆ తర్వాత భారతీయ జనసంఘ్?ను స్థాపించారు. ఇది భారతీయ సంస్కృతి, ప్రయోజనాలకు కోసం అంకితమైన పార్టీగా దీనిని తీసుకొచ్చారు. నాడు 10మందితో ప్రారంభమై, నేడు 12 కోట్ల మంది సభ్యులతో అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించింది. ఈ సందర్భంగా ఆయనకు నేను శిరస్సు వంచి నమస్కరిస్తున్నా' అని అమిత్? షా చెప్పారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, జవహర్?లాన్? నెహ్రూ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వంలో పరిశ్రమల, సరఫరా శాఖ మంత్రిగా చేరారు. ఆ పదవిలో ఉండగా, చిత్తరంజన్ లోకోమోటివ్ ఫ్యాక్టరీ, సింద్రి ఫర్టిలైజర్ కార్పొరేషన్, హిందుస్థాన్ వంటి దిగ్గజ సంస్థలు ప్రారంభించి, భారత పారిశ్రామిక వృద్ధికి బలమైన పునాది వేసే సంస్థలను స్థాపించారు. ఆ తర్వాత వచ్చిన విభేదాల కారణంగా తన పదవికి రాజీనామా చేసి 1951లో భారతీయ జనసంఘ్?ను స్థాపించారు.యాకత్ అలీ ఖాన్‌తో జరిగిన ఢిల్లీ ఒప్పందంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ముఖర్జీ 1950,ఏప్రిల్ 6న కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేశారు. అనంతరం 1951, అక్టోబర్ 21న, ఢిల్లీలో భారతీయ జనసంఘ్‌ను స్థాపించారు. 1953లో కశ్మీర్?లో సందర్శించేందుకు వెళ్లినప్పుడు అక్కడు అరెస్ట్ చేశారు. జైలులో ఉండగానే జూన్? 23న మరణించారు.

# టెక్నాలజీతో కొత్త ముప్పు.. మీ మెదడును హ్యాక్ చేయొచ్చు!

మొదటిపేజీ తరువాయి



మనిషి మెదడును హ్యాక్ చేయడం అనేది ఇప్పటివరకు సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో చూశాం. కానీ, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో ఇది భవిష్యత్తులో నిజమయ్యే ప్రమాదం ఉందని న్యూరోసైన్స్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ) టెక్నాలజీ ఈ సరికొత్త ముప్పునకు దారులు తెరుస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**టెక్నాలజీతో ముప్పు ఎలా?**

ఆలోచనల ద్వారా కంప్యూటర్లు, ఇతర పరికరాలను నియంత్రించేందుకు బీసీఐ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. శరీరంలో అమర్చే ఇంప్లాంట్లు లేదా తలపై ధరించే సెన్సార్ల ద్వారా ఇది పనిచేస్తుంది. అయితే, ఈ సాంకేతికతే హ్యాకర్లకు ఒక ఆయుధంగా మారవచ్చని కార్నెల్ యూనివర్సిటీ అధ్యయనం హెచ్చరించింది. హ్యాకర్లు మెదడు నుంచి కంప్యూటర్‌కు వెళ్లే డేటాను అడ్డగించి, మన ఆలోచనలను చదివే ప్రమాదం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.అంతేకాదు, మెదడుకు పంపే సిగ్నల్స్‌ను తారుమారు చేసి మన భావోద్వేగాలు, నిర్ణయాలు, ప్రవర్తనను కూడా ప్రభావితం చేయవచ్చని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు, పార్కిన్సన్ వ్యాధిగ్రస్తులకు వాడే డీప్-బ్రెయిన్ స్టిమ్యులేటర్లను హ్యాక్ చేసి, మెదడు పనితీరును మార్చేయగలరని యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ గ్లోబల్ క్యాంపస్ నివేదిక పేర్కొంది.

**మానసిక స్వేచ్ఛకు గ్యారెంటీ ఏది?**

ఈ టెక్నాలజీ వల్ల 'న్యూరోప్రైవసీ' అనే కొత్త సమస్య తెరపైకి వచ్చింది. మన మెదడులోని డేటా బయటకు తెలిస్తే, అనారోగ్య సమస్యలు లేదా వ్యక్తిగత ఆలోచనలు బహిర్గతమవుతాయి. దీన్ని నిపుణులు 'కాగ్నిటివ్ లిబర్టీ' (మానసిక స్వేచ్ఛ) ఉల్లంఘనగా అభివర్ణిస్తున్నారు. ప్రతి వ్యక్తికి తమ ఆలోచనలపై పూర్తి నియంత్రణ, గోప్యత ఉండే హక్కును కల్పించాల్సిన అవసరం ఉందని టైమ్ నివేదిక నొక్కి చెప్పింది.

**పరిష్కారంగా 'న్యూరోసెక్యూరిటీ'!**

అయితే, ప్రస్తుతం విస్తృత స్థాయిలో 'మైండ్ కంట్రోల్' చేసేంత శక్తివంతమైన టెక్నాలజీ అందుబాటులో లేదని యునెస్కో కొరియర్ స్పష్టం చేసింది. అయినప్పటికీ, భవిష్యత్ ముప్పును ఎదుర్కొనేందుకు నిపుణులు 'న్యూరోసెక్యూరిటీ' అనే కొత్త విభాగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. కంప్యూటర్లను కాపాడే సైబర్ సెక్యూరిటీ తరహాలోనే, మెదడుకు అనుసంధానించిన పరికరాలను ఎన్‌క్రిప్షన్, సురక్షిత ప్రోటోకాల్స్ ద్వారా రక్షించడమే దీని లక్ష్యం. బీసీఐ టెక్నాలజీ వైద్య రంగం నుంచి వినియోగదారుల చేతికి వస్తున్న తరుణంలో, కఠినమైన భద్రతా నియమావళి, నైతిక మార్గదర్శకాలు తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా 20 వేల సైకిళ్ల పంపిణీ



మొదటిపేజీ తరువాయి

సహాయ మంత్రి బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా ఉచితంగా 20 వేల సైకిళ్లను పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. 11న బండి సంజయ్ పుట్టిన రోజును పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. కరీంనగర్ జిల్లాలో టెన్త్ చదివే పిల్లలు 3,096 మంది ఉన్నారు.కరీంనగర్ తోపాటు రాజన్న సిరిసిల్లలో 3,841, జగిత్యాల జిల్లాలో 1,137, సిద్దిపేటలో 783, హన్మకొండ జిల్లాలో 491 మంది.. మొత్తం కలిపి 9,348 మంది బాలబాలికలు పదో తరగతి చదువుతున్నారు. ఇక కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో 66 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్ కు 50 చొప్పున సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. వీటితోపాటు ఒక్కో మండలానికి వంద చొప్పున సైకిళ్లను అదనంగా పంపిణీ చేయనున్నారు.అలాగే హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఒక్కో వార్డుకు 50 మంది విద్యార్థులకు చొప్పున సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. ఇక ఒక్కో గ్రామ పంచాయతీలో 10 నుండి 25 సైకిళ్ల చొప్పున పంపిణీ చేయనున్నారు. అయితే తొలి దశలో 5 వేల సైకిళ్లను ఈనెల 8 వ తేదీన పంపిణీ చేసేందుకు బండి సంజయ్ టీమ్ సిద్ధమైనట్లు సమాచారం. ఇక ఒక్కో సైకిల్ ను రూ.4 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. సైకిల్ రాడ్ కు ఒకవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇంకోవైపు బండి సంజయ్ ఫోటోను ముద్రించనున్నారు.సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల్లో అధికంగా పేద, మధ్యతరగతి వర్గానికి చెందినవారే ఉంటారు. ఇంటి నుండి స్కూల్ కు వెళ్లడానికి ఇబ్బందులు పడుతుంటారు. ఆటోలు, బస్సుల్లో వెళ్లే స్తోమత ఉండదు. ఇక టెన్త్ క్లాస్ విద్యార్థులకు స్కూల్ అయిపోయాక స్పెషల్ క్లాసులు అని ఉంటాయి. దీంతో ఎక్కువ సమయం స్కూల్ లోనే ఉండాల్సి వస్తుంది. ఈ క్రమంలో విద్యార్థులకు సైకిళ్లను అందించాలని బండి సంజయ్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# 208 కిలోల బంగారు ఆభరణాలతో జగన్నాథుడికి 'సునా భేషా'

### పూరీలో అరుదైన ఘట్టం ఆవిష్కృతం , పూరీలో కొనసాగుతున్న రథయాత్ర ఉత్సవాలు

### జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రకు 208 కిలోల బంగారు ఆభరణాలతో అలంకరణ



ఒడిశాలోని పూరీ క్షేత్రంలో జగన్నాథుడి రథయాత్ర కన్నుల పండవగా జరుగుతోంది. దేశవిదేశాల నుంచి లక్షలాది భక్తులు ఈ రథయాత్రను చూసేందుకు పోటెత్తుతున్నారు. అయితే పూరిలో జరిగే వార్షిక రథయాత్ర ఉత్సవంలో అరుదైన ఘట్టం ఆదివారం ఆవిష్కృతమవ్వనుంది. 'సునా భేషా' ఆచారం జరగనుంది. ఈ సందర్భంగా జగన్నాథుడు, అయన సోదరుడు బలభద్రుడు, సోదరి దేవి సుభద్రలను 208 కిలోల బంగారు ఆభరణాలతో అలంకరించనున్నారు. ఈ క్రమంలో అసలు 'సునా భేషా' అంటే ఏమిటి? ఇది ఎప్పుడు జరుగుతుంది? ప్రత్యేకతలేంటి? తదితర విషయాలు ఈటీవీ భారత్ స్పెషల్ స్టోరీలో తెలుసుకుందాం.

**'సునా భేషా' అంటే ఏమిటి?**

జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రతల దేవతామూర్తులకు బంగారు ఆభరణాలతో అలంకరించి రథంపై ఊరేగించడాన్ని 'సునా భేషా'గా పిలుస్తారు. ఈ ఆచారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులు వీక్షించవచ్చు. 'సునా భేషా' సమయంలో దేవుళ్లను 208 కిలోల బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలకు బంగారం, వజ్రం, వెండి, ఇతర విలువైన లోహాలతో సహా దాదాపు 30 రకాల ఆభరణాలతో అలంకరిస్తారు.

**పూరీ జగన్నాథుని బంగారు ఆభరణాలు**

**565 ఏళ్ల క్రితం నాటి ఆచారం**

"1460లో రాజు కపిలేంద్ర దేబ్ కాలంలో సుమారు 138 డిజైన్ల ఆభరణాలను 'సునా భేషా'లో ఉపయోగించారు. నేటికీ ఈ ఆచారంలో దాదాపు 208 కిలోల బంగారు ఆభరణాలు వాడుతున్నారు. కానీ, అవి పూర్తిగా బంగారంతో చేసినవి కాదు. బంగారం, వెండి, వజ్రాలు, ఇతర లోహాల వంటి విలువైన రాళ్ల మిశ్రమంతో చేసిన ఆభరణాలు. అయితే బంగారం ఆభరణాలు ఎంత బరువైనవో కచ్చితమైన అంచనా లేదు. ఒడిశాలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో సునా భేషాలో బంగారు ఆభరణాల వాడకంపై రికార్డులు అందుబాటులో ఉన్నాయి. కానీ ఆచారంలో ఉపయోగించిన బంగారం బరువు గురించి ప్రస్తావించలేదు. రథయాత్ర సమయంలో రథాలపై సునా భేషాకు ముందు ప్రతి ఏటా బంగారు ఆభరణాలను పునరుద్ధరించడం జరుగుతుంది. గత కొన్నేళ్లుగా భక్తుల నుంచి స్వామి ఖజానాకు దాదాపు 50 కిలోల బంగారం అందుతోంది" అని రచయిత, శ్రీ జగన్నాథ్ సంస్కృతి పరిశోధకుడు భాస్కర్ మిశ్రా తెలిపారు.

## ఎఫ్ టి పి సి మీడియా డైరెక్టర్ నియామకానికి నోముల ప్రకాష్ కు ప్రత్యేక ఆహ్వానం



**సికింద్రాబాద్,తెలంగాణ సేన జూలై 6:** ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్ టి పి సి) తెలంగాణ మీడియా డైరెక్టర్ గా జి. చంద్రశేఖర్ నియామకం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమానికి ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఫ్ టి పి సి ఇండియా తెలంగాణ చైర్మన్ కిరణ్ బేజాడి ముఖ్యఅతిథిగా నోముల ప్రకాష్ ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భాగ్యనగర్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం రాంపల్లి పాల్గొని అభినందనలు తెలిపారు. ఎఫ్ టి పి సి లో జి. చంద్రశేఖర్ కు మీడియా విభాగంలో ఈ కీలక బాధ్యతలు కల్పించడం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

## తొలి ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహణ

### శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఫౌండర్ & చైర్మన్ నోముల ప్రకాష్



**తెలంగాణ సేన , సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ నామాలగుండు ప్రాంతంలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి వేడుకలు శ్రద్ధాభక్తులతో, అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ మహోత్సవాలను దేవస్థానం ఫౌండర్ & చైర్మన్ నోముల ప్రకాష్ నేతృత్వంలో భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు స్వామివారి దర్శనార్థం దేవస్థానానికి చేరుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చైర్మన్ నోముల ప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో శుభ్రత, క్యూలైన్లు, ప్రసాద పంపిణీ సహా అన్నీ సేవలతో భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించారు. ఈ వేడుకలలో ఎఫ్.టి.పి.సి ఇండియా మీడియా చైర్మన్ కిరణ్ బెజడి,మీడియా డైరెక్టర్ మున్నూరు చందు, భాగ్యనగర్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంపల్లి సత్యం ,బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు భానుమతి ,ఎన్.ఆర్.టీవీ సీఈఓ ఉమామహేశ్వరి,నాగ మల్లేశ్వరి వీరితో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు, హారతి, తీర్థప్రసాదాల పంపిణీతో కూడిన ఈ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా, శ్రద్ధా గంభీరతలతో కొనసాగింది.

## మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం



**సికింద్రాబాద్ తెలంగాణ సేన జూలై 6 :** సికింద్రాబాద్ అసెంబ్లీ మున్నూరు కాపు సంఘం కార్యాలయంలో సాదురాం కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ అధ్యక్షులు, ట్రస్టీ శ గంప చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు పేద ప్రజలు 100 మంది ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగిశెట్టి హనుమంతరావు, కోశాధికారి చేర్యాల శ్రీనివాస్, హరికృష్ణ, మాద ప్రమోద్, మున్నూరు చందు,షామీర్పేట్ కృష్ణ, కట్కూరి శ్రీకాంత్, సిరిగిరి పవన్, నర కృష్ణ, ఎర్ర నరహరి, రామ్ సుంకరి, భానుమతి సుంకరి తదితర నాయకులు పాల్గొన్నారు.

## బైంసాలో బుద్ధునితో నా ప్రయాణం తెలుగు నాటిక.



**ముధోల్/జూలై 06/తెలంగాణ సేన న్యూస్.:** బైంసా పట్టణంలోని ఎన్ఎస్ గార్డెన్ లో సోమవారం సాయంత్రం బుద్ధునితో నా ప్రయాణం తెలుగు నాటిక అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రదర్శించడం జరుగుతుందని బుద్ధ విహార కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన ముధోల్ లో బుద్ధునితో నా ప్రయాణం తెలుగు నాటిక కరపత్రాలను బుద్ధ విహార కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ బౌద్ధమతం సిద్ధార్థ గౌతముడు స్థాపించి ప్రజ్ఞ- శీల-కరుణ-సమానత్వము- మైత్రి భావమును ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందిని ప్రభావితం చేస్తుందన్నారు. మనిషి తనను తాను కేంద్రంగా తీసుకొని ఎలా ఉన్నతికరించుకోవాలి- జీవితం పై నూతన దృక్పథం సత్ప్రవర్తనను ఎలా పెంపొందించుకోవాలో వివరించిన మార్గదర్శకులు గౌతమ బుద్ధుడు అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశంలో బౌద్ధ ధర్మాన్ని పున:జీవింప చేశారని అన్నారు. బౌద్ధ ధర్మం విశిష్టతను బుద్ధునితో నా ప్రయాణం తెలుగు నాటిక ద్వారా సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే విధంగా ప్రదర్శించబడుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ ఉపాసకులు, ఉపాసికులు యువకులు అధిక సంఖ్యలో వచ్చి నాటికను వీక్షించాలని కోరారు.

## ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్ రామ్

### వర్ధంతి కార్యక్రమంలో నివాళులు అర్పించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేస్ చిస్తి





**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, జూలై 6. :** జగజీవన్ రామ్ ఆదర్శప్రాయుడని ,ఆశయ సాధన కోసం కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి కొనియాడారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం ఆధ్వర్యంలో ప్రిన్స్ కార్నర్ ఆయన విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులు జరిగాయి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి చిస్తి మాట్లాడుతూ , సామాన్య దళిత కుటుంబంలో జన్మించిన జగ్జీవన్ రామ్ ఓటమి ఎరుగని నేత అని ఉత్తమ పార్లమెంట్ సభ్యునిగా కేంద్ర మంత్రి గా దేశ ఉప ప్రధానిగా ఎన్నో సేవలు అందించారు అని ముఖ్యంగా అనేక శాఖలు నిర్వహించిన మంత్రిగా ప్రత్యేక గుర్తింపు పొందడమే కాకుండా హరిత విప్లవం, ఇండియా పాకిస్తాన్, ఇండియా చైనా ,యుద్ధ సమయాలలో దేశ విజయం కోసం కీలకపాత్ర పోషించారని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు జగ్జీవన్ రామ్ ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి షరీఫ్, పిట్టల బాలరాజు, నాగారం శంకర్, కైరం కొండ వెంకటేష్ ,పోకల యాదగిరి, చల్లగురువుల రఘు బాబు, ఎండి మజహర్, గుర్రాల శ్రీనివాస్, కాకునూరి మహేందర్, ఎండి సలావుద్దీన్, ఎలిగే సురేందర్, అందే నరేష్, వస్తుపుల సాయి, తదితరులు పాల్గొన్నారు

## సేవలతో ప్రజల మన్ననలు పొందాలి

### డిజిటల్ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం




**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, జూలై 6** :సక్రమమైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలి అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సూచించారు.దఆదివారం పట్టణం లోని స్థానిక హైదరాబాద్ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించార. యజమాని మొహమ్మద్ ఇబ్రహీం కు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అవేజ్ చిస్తి, పిసిసి రాష్ట్ర కార్యదర్శి పోత్నాక్ ప్రమోద్ కుమార్,మాజీ మున్సిపల్ చైర్మన్ లు బర్రె జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, రెడ్ క్రాస్ జిల్లా కమిటీ డైరెక్టర్ షేక్ హామీద్ పాషా , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి రవికుమార్,మాజీ కౌన్సిలర్ ఈరపాక నరసింహ, పింగల్ అన్న సేవాదళ్ అధ్యక్షులు ఎండి మోయిన్, మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మహమ్మద్ షరీఫ్,మాజీ కో ఆప్షన్ సభ్యులు అబేద్ అలీ,కౌసర్,భారీ,కాసులు రఘు, నర్సింహా రెడ్డి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశం.. మేల్కొనాల్సిన సమయం.!

-ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464



**ఆదిలాబాద్ జిల్లా జూలై 06 (తెలంగాణ సేన న్యూస్) :** జనాభా అంశంపై ప్రపంచ దేశాలు రెండుగా విడిపోయాయి. కొన్ని దేశాలు ఇప్పటికీ అధిక జనాభాతో బాధపడుతున్నట్లు భావించి నియంత్రణ చర్యలు పాటిస్తుండగా.. మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదల కోసం అనేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణ కోసం కఠిన చట్టాలు అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు సడలింపులు ఇస్తున్నాయి. భారతదేశంలోని రాష్ట్రాల పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయి. ఉత్తర భారతానికి చెందిన యూపీ, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యతనిస్తుండగా.. దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు సమస్యలకు కారణమని తెలుస్తున్నది. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే అది దేశానికి శాపంగా కాకుండా వరంగా మారే అవకాశాలే ఎక్కువ అని పలు దేశాలు ఇప్పటికే నిరూపించాయి. ప్రస్తుతం ప్రపంచ జనాభా 820 కోట్లకు పైనే. 2080 నాటికి ఇది 1030 కోట్లకు చేరవచ్చని అంచనా. 143 కోట్ల జనాభాతో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, 142 కోట్లతో చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణ సందర్భాలపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది, కానీ సమర్థవంతమైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు.



జూలైలో నిర్వహించనున్న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని..

**సరైన ప్రణాళికలతో సింగపూర్ ఇలా..**

జనాభాను అంకెల పరంగానే కాకుండా జనసాంద్రత పరంగా పరిశీలిస్తే కూడా కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో ఎలా అభివృద్ధిపథంలో నడిచాయో తెలుస్తున్నది. ఇందులో అధిక జనసాంద్రత ఉన్నప్పటికీ సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. జనసాంద్రత పరంగా సింగపూర్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు మాత్రమే కాగా, చదరపు కిలోమీటర్ కు 8,595 మంది నివసిస్తున్నారు. అయితే అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా నిలుస్తున్నది. 1960-70లలో 'స్టాప్ ఎట్ టూ' కార్యక్రమం ద్వారా జనన రేటును తగ్గించిన ఈ దేశం.. 1980ల నుండి ప్రో-నాటలిస్ట్ విధానాలతో (బేబీ బోనస్ స్కీమ్) ద్వారా జనన రేటును సమతుల్యం చేసింది. జనాభా విషయంలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే ఈ దేశ అభివృద్ధికి కారణమని తెలుస్తున్నది.

**డిసిషన్స్ పైనే చైనా డెవలప్ మెంట్..**

జనాభాలో మొన్నటి వరకు ఫస్ట్ ప్లేస్ లో ఉండి ఇప్పుడు రెండో స్థానంలో ఉన్న చైనా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడంతో అభివృద్ధిలో ముందంజలో ఉన్నట్లు స్పష్టమవుతున్నది. చైనా జనాభా ప్రస్తుతం 142 కోట్లు. అయితే జనసాంద్రత పరంగా ఈ దేశం ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. చదరపు కిలోమీటర్ కు 153 మంది నివసిస్తున్నారు. అయితే 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని కఠినంగా అమలు చేసింది. దీని ద్వారా సుమారు 40 కోట్ల జనాభాను నియంత్రించగలిగింది. అయితే ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతంగా ఉపయోగించింది. ఫలితంగా ఇప్పుడు చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారింది. అయితే కఠిన విధానాలు జనాభా నియంత్రణలో విజయవంతమైనప్పటికీ, దీర్ఘకాల సామాజిక పరిణామాలను పరిగణనలోకి తీసుకోకపోవడం సమస్యలను సృష్టించింది. వృద్ధ జనాభా ఎక్కువ కావడం, లింగ నిష్పత్తిలో తేడాలు రావడంతో ఆ దేశం వెంటనే అప్రమత్తమైంది. 2015లో టూ చైల్డ్ పాలసీ, 2021లో మూడు పిల్లల విధానాన్ని ప్రవేశపెట్టింది.

**భారతదేశం.. మేల్కొనాల్సిన సమయం..**

భారతదేశం 3,287,263 చ.కి.మీ. వైశాల్యంతో ప్రపంచంలో ఏడో స్థానంలో ఉన్నది. కానీ 143 కోట్ల జనాభాతో మొదటి స్థానంలో ఉన్నది. ఇక్కడ జనసాంద్రత (485/చ.కి.మీ.) కూడా ఎక్కువే. అయితే ఉత్తర, భారత దేశాల్లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను కఠినంగా పాటించగా, ఇప్పుడు ఇక్కడ సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారత దేశంలో యువ జనాభా 65% (35 ఏళ్లలోపు) ఉంది. ఈ అంశం సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడగలదు. సరైన అర్బన్ ప్లానింగ్ పాలసీ, ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక వినియోగం వంటి వాటిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. విద్య, ఆరోగ్యం, సాంకేతికతను ఉపయోగించి జనాభాను ఒక శక్తిగా మార్చాలి. ఎక్స్ పోర్ట్-ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. సాంకేతికతను ఉపయోగించి, గ్రామీణ-నగర అసమానతలను తగ్గించవచ్చు. సమర్థవంతమైన ప్రణాళికల ద్వారా, జనాభా సమస్యల సవాళ్ల నుండి సమృద్ధికి మార్గాలను వెతికితే.. కొన్ని దశాబ్దాల్లోనే ఇండియా నంబర్ వన్ ఆర్థిక శక్తిగా మారే అవకాశముంది.

# ఆశయాలను ముందుకు తీసుక పోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

### మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్ రామ్ 39 వ వర్ధంతిలో

### ఆర్డీఓ కృష్ణా రెడ్డి





**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, జూలై 6 :** బాబు జగజీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నది అని ఆర్డిఓ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం 39వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ప్రిన్స్ కార్నర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు మహనీయులను స్ఫూర్తి గా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బాబు జగ్జీవన్ రామ్ పార్లమెంట్ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా దేశ ఉప ప్రధానిగా అనేక సేవలు అందించారు అని, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులు అందరికి అందే విధంగా కృషి చేసిన మహ నీయుడని అన్నారు. విద్య పట్ల ప్రతీ ఒక్కరు శ్రద్ధ పెట్టాలని, తద్వారా మాత్రమే సమాజంలో అంతరాలు పోయేందుకు అవకాశం ఉన్నదని, ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత స్థాయికి అందరు ఎదగాలని, అప్పుడే సమాజంలోని అంతరాలు దూరం అవుతాయని అన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ లు ఆనాడే ఎంతో మేధో సంపత్తితో సామాజిక మార్పు కోసం బాటలు వేశారని, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య లు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ కృషి వల్ల ఈదేశంలో అనేక సంస్కరణలు వచ్చాయని, ఆయన కేంద్ర మంత్రిగా చేసిన సేవలు, తీసుకున్న నిర్ణయాలు దేశానికి ఎంతో మేలు చేశాయని అన్నారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ సమన్వయం చేయగా కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్ కుమార్ , ఎం ఆర్ పి ఎస్ జిల్లా ఇంచార్జ్ బీరు మహేంద్రర్ మాదిగ ,నాగారం అంజయ్య, బర్రె సుదర్శన్ ,బండారు రవి వర్ధన్, సిర్పంగ శివలింగం, దుబ్బ రామకృష్ణ మాదిగ కడ్తాల శ్రీనివాస్, ఏవి కిరణ్ కుమార్ ,బానోత్ భాస్కర్ నాయక్ , పల్లెర్ల వెంకటేశం, బట్టు మురళి ,బొడ్డు కృష్ణయ్య, మేడి కొటేష్ ,పోట్ట శ్రీనివాస్ ,నాగరం శంకర్, కారుపటి రాజు, బర్రె నాగేష్, చిలువేరు రమేష్, కనుకుంట్ల కోటి, రమేష్, అందే సాయి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వెల్నెస్ హాస్పిటల్ వారి ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్




### యువత క్రీడల్లో రాణించాలి - డాక్టర్ నాగ మునయ్య

**తెలంగాణ సేన :** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీర దృఢత్వాన్ని కలిగిస్తాయని, యువత క్రీడల్లో రాణించాలని గజ్వేల్ ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ నాగ మున్నయ్య అన్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని బాక్స్ క్రికెట్ గ్రౌండ్లో వెల్నెస్ హాస్పిటల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జరిగినటువంటి ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం రోజు అట్టహాసంగా ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ ముగింపు వేడుక నిర్వహించారు ఇందులో మొత్తం 12 టీములు పాల్గొనగా ఫైనల్ కీ రెండు టీములు బాలాజీ న్యూరో ఆక్సీకేర్ హాస్పిటల్ ఫైనల్ లో పోటాపోటీగా జరిగిన ఆటలో ఆక్సికేర్ హాస్పిటల్ విన్నర్ గా విజయం సాధించింది, బాలాజీ న్యూరో హాస్పిటల్ రన్నర్ గా నిలిచింది. ఈ కార్యక్రమం అనంతరం ప్రతి టీం ప్లేయర్స్ కు వెల్నెస్ హాస్పిటల్స్ విపి. జి ఎస్ రెడ్డి. మరియు జిఎం. టి.ఆర్ రెడ్డి మరియు గజ్వేల్ ఐఎంఏ అధ్యక్షులు నాగ మునయ్య ప్లేయర్స్ కి అందరికీ బహుమతులను అలాగే మెడల్స్ ని గిఫ్ట్ ప్రైజ్ ప్రతి ప్లేయర్ కి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు నాగ మునయ్య మాట్లాడుతూ ముందుగా వెల్నెస్ హాస్పిటల్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు క్రీడలు మానసిక ఉల్లాసం తో పాటు శరీర దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినటువంటి వెల్నెస్ హాస్పిటల్ హైదరాబాద్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఇలాంటి కార్యక్రమాలు ఇంకెన్నో జరపాలని వెల్నెస్ హాస్పిటల్ ద్వారా ఇంకా మంచి మంచి సేవలు ప్రజలకు ఎన్నో అందించాలని ఆయన కోరారు వెల్నెస్ హాస్పిటల్ వారిని అభినందించారు

## బోనాలతో ర్యాలీగా బయలుదేరిన మహిళలు

### భీరన్నకు బోనాల సమర్పణ

**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి జూలై 06** : పట్టణంలోని యాదవ నగర్ నుండి యాదవ సంఘం అధ్యక్షులు బద్దుల రాజ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక సిరిసపల్లి ఎక్స్ రోడ్డులో గల బీరన్న దేవాలయంకు భారీ ఎత్తున మహిళలు బోనాలతో ర్యాలీగా బయలుదేరి భీరన్నకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భీరన్నకు మొక్కులు చెల్లించారు. సుఖ సంతోషాలతో అందరూ ఉండాలని దేవుని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి భాష బోయిన చిన్న రవి, కార్యవర్గ సభ్యులు సింగరేణి రవి, గంద్రకోట సారయ్య, గాదం స్వరూప, మక్కపల్లి కుమార్ స్వామి, భాష బోయిన చిన్న శ్రీనివాస్, భాష బోయిన రవి, ఓదెలు, రవి, మొండయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో వేగం పెంచాలి

### గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజు నాయక్



నర్సంపేట తెలంగాణ సేన : ఖానాపురం మండలం వేప చెట్టు తండా గ్రామపంచాయతీ పరిధిలో ఈరోజు ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు గ్రామ కమిటీ అధ్యక్షులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గుగులోతు రాజు నాయక్ మూడు దేవేందర్ నాయక్ గుగులోత్ సంతోష్ ధారావత్ బిచ్చా ధారావత్ బాల్య గుగులోతు పవన్ రమేష్ పాండ్యా మూడు పూలు మూడు కిషన్ గుగులోతు దాన్ని గుగులోతు వాలి తదితరులు ఉన్నారు.

## ప్రజా నిరసన కార్యక్రమానికి బిఆర్ఎస్ కార్యకర్తలు తరలిరావాలి


### ఇర్ప సూరయ్య మండల పార్టీ అధ్యక్షుడు



**గంగారం తెలంగాణ సేన :** బిఆర్ ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి. లక్ష్మీనరసింహారావు మరియు ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి ఆదేశానుసారంగా వారి ఆధ్వర్యంలో ఈనెల 7న, ములుగు జిల్లా ప్రజల పక్షాన నిర్వహించే ప్రజా నిరసన కార్యక్రమానికి గంగారం మండలం పార్టీ కార్యకర్తలు,మండల సీనియర్ నాయకులు,%దీ=ా%పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు,గ్రామ పార్టీల అధ్యక్షులు,మండల మహిళా, గ్రామ మహిళా నాయకురాలు, గ్రామ పార్టీల అధ్యక్షులు వివిధ గ్రామాల పార్టీ సీనియర్ నాయకులు ములుగు జిల్లా కేంద్రానికి ఉ,11-00గం,లకు తరలిరావాలని బి.ఆర్.ఎస్ పార్టీ మండల కమిటీ పక్షాన పిలువనిచ్చారు.

## బాసర మండలంలో ఆయా గ్రామాల్లో మొదలైన పీర్ల సంబురాలు..

### కీర్గుల్ కె లో ఘనంగా సవర్లు



**బాసర/జూలై 06/తెలంగాణ సేన న్యూస్. :** నిర్మల్ జిల్లా :-బాసర మండల కేంద్రంలో ఆయా గ్రామాల్లో పీర్ల పండుగ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మొహర్రం పర్వదినం పురస్కరించుకొని కుల మతాలకు అతీతంగా గ్రామాల్లో పీర్ల పండుగను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా బాసర మండలాల్లోని పల్లెల్లో కీర్గుల్ ( కె) కౌట. ఓని. సాలాపూర్. కీర్గుల్ ( బీ) టాక్లి . బెదిరెల్లి. పీర్ల పండుగ కొత్త శోభను తెచ్చిపెట్టింది. హిందువులు. ముస్లిం సోదరులు, కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి ఆనందంగా జరుపుకునే పీర్ల పండుగ వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మొహర్రం సందర్భంగా గ్రామాల్లో పీర్ల ఊరేగింపు దప్పు చప్పుళ్ల మధ్య వీధి వీధిన తిరుగుతూ పీర్లను ఊరేస్తారు. సాయంత్రం మసీదు వద్ద ఆల్వా ఆటలు ఆడుతూ 'అసైదుల హారతి' పాటలు పాడుతూ పీర్ల. నైవేద్యంగా . చక్కెర. బెల్లం ముద్దలు. మల్లెపూల దండతో. భక్తులు ముక్కులు తీర్చుకుంటారు . పీర్ల పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటారు.

## నిరాశ్రయులు, సంచారజాతుల కుటుంబాలకు దుస్తులు పంపిణి



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్:** దహైదరాబాద్ మహా నగరంలో రోడ్ల పక్కన ఫుట్పాత్లే జీవనాధారంగా జీవనం సాగిస్తున్న అభాగ్యులు, సంచారజాతులు, నిరుపేదలకు దుస్తులు, బిస్కెట్ ప్యాకెట్స్ అందించాము. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని సేవాసభ్యులు పాల్గొన్నారు.

## పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ కు ఘన సన్మానం



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఆషాడ మాసం బోనాల పర్వదినం సందర్భంగా పద్మశాలి యువజన సంఘం సభ్యులకు పద్మశాలి పెద్దలకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్ కుమార్ కు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు అనంతరం పద్మశాలి సంఘం సభ్యులు మాట్లాడుతూ పద్మశాలి సంఘం బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న ప్రేమ్ కుమార్ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు స్వీకరించాలని వారికి అభినందనలు తెలిపారు, ఈ కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం సభ్యులు పద్మశాలి పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## యూరియా కొరత రైతుల గోస..

### రైతులను రోడ్డుకిడ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువు ల కోసం పాదరక్షల లైన్.



**కొత్తగూడ తెలంగాణ సేన :** సమైక్యాంధ్ర పాలన తలపిస్తున్న కాంగ్రెస్ పాలన.... సరిగ్గా 2014 ముందు రైతులు ఎరువుల కోసం చెప్పులు లైన్లో పెట్టిన దుస్థితి తెలిసిందే... ఎండ వాన అనే తేడా లేకుండా రైతు తన పొలం పని వదులుకొని లైన్లో ఉంటే గాని రెండు బస్తాలు ఇచ్చేవారు. అలాంటి రోజులు ఇదే పోగుళ్ళ పల్లి సొసైటీ గతాన్ని తలపిస్తుంది . ఇది వాస్తవం కాదా... ఆనాడు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ పాలనలో ఎరవుల కోసం చెప్పుల లైన్..నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన లో అదే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కనీసం రైతులకు ఎరువులు అందించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి నెహ్రూ నాయక్ మండిపడ్డారు.రైతులను ధగ చేయడమే కాంగ్రెస్ పార్టీ ఎజెండాన అని ప్రశ్నించారు. జులై 8న రాష్ట్రమంతట ఒకే రోజున బంజారా లు శీతల పండుగను నిర్వహించాలి.

## జులై 8న రాష్ట్రమంతట ఒకే రోజున బంజారా లు శీతల పండుగను నిర్వహించాలి

### ఎల్ హెచ్ పి ఎస్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి బోడ లక్ష్మణ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్



**మహబూబాబాద్ జులై: 06** లంబాడిల సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే శీతల పండుగను లంబాడ సోదరులందరూ జూలై 8 తేదీన మంగళవారం నాడు జరుపుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి ( నంగారాబేరి ) ఎల్ హెచ్ పి ఎస్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ బోడ లక్ష్మణ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్ కోరారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన ఎల్ హెచ్ పి జిల్లా కమిటీ సమావేశంలో ఎల్ హెచ్ పి ఎస్ బోడ లక్ష్మణ్ నాయక్, జిల్లా అధ్యక్షులు అంగోత్ చందులాల్ మాట్లాడుతూ... యావత్ లంబాడి జాతి ఐక్యతను చాటేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రజలందరూ ఒకేరోజు శీతల పండుగ జరుపుకోవడం ద్వారా మన యొక్క జాతి ఐక్యతను నిలబెట్టాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం లంబాడీల పండుగ అయిన సీతల పండుగను గుర్తించి జులై 8న ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అజ్మీర శ్రీనివాస్ నాయక్,బానోత్ పవన్ నాయక్,భూక్యా రమేష్ నాయక్,మూడు రవీ నాయక్, అజ్మీర వెంకన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## త్యాగనిరతికి, సహనానికి మొహర్రం ప్రతీక!



**తెలంగాణ సేన న్యూస్** /జూబ్లీహిల్స్ కాంసెన్సీ శాసనసభ్యులు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు స్వర్గీయ శ్రీ,మాగంటి గోపినాథ్ కుమార్తెలు మాగంటి,అక్షర,నాగ, మాగంటి,దీశిరా..శ్రీ నగర్ కాలనీ డివిజన్ లో రాష్ట్ర వ్యాప్తంగా హిందూ ముస్లింలు ఐక్యంగా జరుపుకునే పండుగ పీర్ల పండుగ.. తెలంగాణ గంగా జమున తెహజీబ్ సంస్కృతికి ప్రతీక. ఈ పవిత్ర మొహర్రం పర్వదినం సందర్భంగా శాంతి, సౌభాగ్యం, మత సామరస్యం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నాను.మొహరం సందర్భంగా డివిజన్ అధ్యక్షులు అప్పు ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన షార్బత్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో , మధు యాదవ్, జహీర్, కలీం, అవినాష్ గౌడ్, శిరీష, రాణి, అంబికా, రమా మరియు డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## హుజురాబాద్ డివిజన్‌లోని ఎస్సీ వసతి గృహాల్లో ప్రవేశాలకు అవకాశం

### ఉచిత విద్య, భోజన వసతి విద్యతో పాటు అన్ని సౌకర్యాలు!

### సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం.విజయ్ పాల్ రెడ్డి



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి, జూలై 06 :** హుజురాబాద్ డివిజన్‌లోని 12 ప్రీ-మెట్రిక్, 2 పోస్ట్-మెట్రిక్ ఎస్సీ హాస్టల్స్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం. విజయ్ పాల్ రెడ్డి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ఎస్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అందుబాటులో ఉన్న ఖాళీలు:

ప్రీ-మెట్రిక్ హాస్టల్స్ (బాలుర, బాలికలు):

హుజురాబాద్: బాలుర హాస్టల్‌లో 71, బాలికల హాస్టల్‌లో 78.
జమ్మికుంట: బాలుర హాస్టల్‌లో 35, బాలికల హాస్టల్‌లో 82.
వావిలాల: బాలుర హాస్టల్‌లో 88.
వీణవంక: బాలుర హాస్టల్‌లో 70.
రేకొండ: బాలుర హాస్టల్‌లో 77.
చిగురుమామిడి: బాలుర హాస్టల్‌లో 81.
సుస్తులాపూర్: బాలుర హాస్టల్‌లో 72.
ఇందుర్తి: బాలుర హాస్టల్‌లో 78.
తిమ్మాపూర్: బాలికల హాస్టల్‌లో 215.

**పోస్ట్-మెట్రిక్ హాస్టల్స్ (కాలేజీ విద్యార్థులు):**

హుజురాబాద్: బాలుర హాస్టల్‌లో 170. జమ్మికుంట: బాలికల హాస్టల్‌లో 130. కల్పించే సౌకర్యాలు, ప్రత్యేకతలు:

ఈ హాస్టల్స్‌లో చేరిన విద్యార్థులకు ఉచిత భోజన వసతి, నోట్‌బుక్స్, నాలుగు జతల దుస్తులు, బెడ్‌షీట్, కార్పెట్, షూస్, స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్స్, మరియు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తారు. పౌష్టికాహారం: ప్రతిరోజూ ఉదయం రాగి జావ/పాలు/పండ్లు, టిఫిన్, సాయంత్రం స్నాక్స్. వారానికి రెండుసార్లు (గురువారం, ఆదివారం) చికెన్ లేదా బగారా అన్నం. రాత్రి భోజనంలో అన్నం, ఆకుకూరలు/కాయగూరలు, పప్పు, రసం, మజ్జిగ, ఉడికించిన గుడ్డు. వసతులు: బంకర్ బెడ్స్, ప్లేటు, గ్లాసు, ట్రంక్ పెట్టె, దుప్పట్లు, పరుపు, దిండు, స్పోర్ట్స్ షూ, స్కూల్ షూ ఉచితంగా అందిస్తారు. కాస్మెటిక్ ఛార్జీలు: బాలురకు నెలకు రూ. 150-200, బాలికలకు నెలకు రూ. 175-275. అదనపు తరగతులు: పదవ తరగతి విద్యార్థులకు సైన్స్, గణితం, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులలో ట్యూటర్లచే ప్రత్యేక తరగతులు, స్టడీ మెటీరియల్స్. ఇతర సౌకర్యాలు: సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, స్పోర్ట్స్ మెటీరియల్, టీవీ. విద్యా సంవత్సరంలో ఉచిత విజ్ఞాన విహారయాత్రలు. దరఖాస్తు విధానం:

మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారంతో పాటు, విద్యార్థి 4 ఫోటోలు, ఆదాయ ధృవీకరణ పత్రం, బోనఫైడ్ (ఒరిజినల్), ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ జతపరచాలి. ప్రజా ప్రతినిధులు, విద్యార్థి సంఘ నాయకులు, కుల సంఘ నాయకులు, వివిధ స్వచ్ఛంద, సామాజిక సంస్థల ప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులను చేర్పించుటలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజయ్ పాల్ రెడ్డి కోరారు. మరిన్ని వివరాల కోసం హుజురాబాద్ డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం. విజయ్ పాల్ రెడ్డిని 9399957766 నంబర్‌లో సంప్రదించవచ్చు.

## కేంద్రం ఎర్రజెండా పార్టీని అంతంనే ఆలోచనలను విరమించుకోవాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్





**నిర్మల్ : /జూలై 06/తెలంగాణ సేన న్యూస్.** : కేంద్ర ప్రభుత్వం “ఎర్రజెండా పార్టీలను” అంతం చేయాలనే ఆలోచనలను తక్షణమే విరమించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం రోజున నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ భవన్‌లో జరిగిన 4వ సీపీఐ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

“ఆపరేషన్ కగార్” ప్రకటన కేంద్రం ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ పట్ల అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర ఆందోళనను తెలియజేస్తోందని శంకర్ అన్నారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప, ఒక పార్టీని అంతం చేస్తామనే ప్రకటన సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ఉత్సవాలను జరుపుకుంటోందని, 1925లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో సీపీఐ స్థాపించబడిందని గుర్తు చేశారు. దేశంలోని 32 రాష్ట్రాలలో పేదల పక్షాన, కార్మికుల పక్షాన వారి సమస్యల సాధన కోసం సీపీఐ పోరాటం చేస్తుందని ఆయన వివరించారు.కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు వ్యక్తం చేశారు.వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యాపారస్తులకు అప్పగించి, ప్రజలను నిరుద్యోగులను చేస్తున్నారని కలవేని శంకర్ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారని, గత ఎన్నికల్లో బీజేపీ సర్కార్ ఇచ్చిన వాగ్దానాలను అమలు పర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. నిర్మల్ జిల్లాలోని 1000 ఊడల మర్రి, రాంజీ గోండు చరిత్ర గల గడ్డను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, రేషన్ కార్డు లేని పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్మల్ మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అక్కడే కొనసాగించాలని, డిప్యుటేషన్‌పై పంపకూడదని కోరారు. ఉద్యోగులను వేధింపులకు గురిచేయడం మానుకోవాలని, లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ ఆయాలను కూడా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.భారత కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నడుము బిగించాలని సూచించారు.

**పీజీ కాలేజీ కోసం ఉధృత పోరాటం : సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. విలాస్**

అనంతరం సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. విలాస్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో గతంలో పీజీ కాలేజీ ఉండేదని, అది ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్యను అందించేదని తెలిపారు. కొందరు రాజకీయ దురుద్దేశంతో దానిని వరంగల్‌కు తరలించారని ఆరోపించారు. మళ్లీ పీజీ కాలేజీ కోసం సీపీఐ పార్టీ తరఫున ఉధృత పోరాటం చేపడతామని, కళాశాలను సాధించే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.విద్యారంగ అభివృద్ధికి వెనుకబడిన నిర్మల్ జిల్లాను మరింత అభివృద్ధి పరచాలని, విద్యా సంబంధిత కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అసంఘటిత రంగ కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అందించాలని, పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు.కార్మికుల త్యాగాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పట్టాలిచ్చిన తర్వాత కూడా ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తూ పోడు భూములలో చెట్లు నాటడం సమంజసం కాదన్నారు. వేధింపులు ఆపకుంటే ఫారెస్ట్ కార్యాలయం ముందు ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో రాంజీ గోండు మ్యూజియం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను, స్థలమున్నవారికి ఐదు లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. దిలావర్‌పూర్ మండలంలోని ఇథనాల్ ఫ్యాక్టరీని శాశ్వతంగా తొలగించాలని, తాత్కాలికంగా పనులు నిలిపివేయడం కాదని అన్నారు.దేశంలో కార్మిక వ్యతిరేక పోరాటం జరుగుతోందని, అసంఘటిత కార్మికులను పర్మినెంట్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. భారతీయ కమ్యూనిస్టు పార్టీని నమ్ముకున్న వారిని ఎప్పుడూ వమ్ము చేయదని, రాబోయే రోజుల్లో కమ్యూనిస్టులదే భవిష్యత్తు అని వారు అన్నారు. ఈ మహాసభలో సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి. భుక్య రమేష్.జిల్లా కార్యవర్గ సభ్యులు కే రవి. పద్మ కుమారి. కైలాస్.సాయి. బి శివాజీ. లచ్చన్న. అబ్దుల్ మసీద్. జి గోపి. టీ ప్రకాష్. ఎస్ కుమార్ తోపాటు సిపిఐ అనుబంధ సంఘ నాయకులు, కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రభుత్వం విప్లవకారులతో శాంతి చర్చలు జరపాలి ..

### ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండను నిలిపివేయాలి..

### విరసం ఆవిర్భావ సభలో వక్తలు..




**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్:** విప్లవ రచయితల సంఘం 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంధర్బంగా విరసం ఆధ్వర్యంలో “కాల్పుల విరమణ ఒప్పందాలు - విప్లవధ్యమ పంథా: మార్క్సిస్ట్ దృక్పథం” అనే అంశం పై సుంధరయ్య విజ్ఞన కేంద్రంగా 55 వ ఆవిర్భావ సభ నిర్వహించడం జరిగింది. ఈ సంధర్బంగా సభలో వక్తలు మాట్లాడుతూ .. అజిత్.. విప్లవోద్యమం విలువలకు కట్టుబడి ఉంటుందని, చరిత్రలో ఎన్ని నిర్బంధాలు విధించిన విప్లవోద్యమం దాని పంథాని మార్చుకోకుండా నిర్బంధాన్ని ఎదురించిందని, ప్రస్తుత కాలంలో ఎంత రాజ్య నిర్బంధం ఉన్న విప్లవోద్యమం ఏకాకి కాకుండా నిలబడుతుందని అన్నారు. తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో కగార్ కి వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ఆందోళనలు చేపట్టాయి అన్నారు. రానున్న రోజుల్లో మోడి ప్రభుత్వం మరింత నిర్బంధం ప్రజలపై ఉద్యమకారులపై అమలు చేస్తుందని దానికి వ్యతిరేకంగా విప్లవోద్యమ వ్యూహాలు ఉంటాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కార్మికుల, రైతుల, నిరసనలే వాటికి నిదర్శనం అన్నారు. యువత మారుతున్న కాలానికి సామాజిక మాధ్యమాల కేంద్రంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు, సామ్రాజ్యవాద దేశాలు వాటి ఆర్థిక లక్ష్యాలను కాపాడుకోవడానికి సుంకాలు, ఆంక్షలు అమలు చేస్తున్నాయి అన్నారు..వరలక్ష్మి : చర్చలు జరపము అనే హక్కు ప్రభుత్వానికి లేదని, చర్చలే లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం లేదని అన్నారు, ఆదివాసీలను, విప్లవ కారులను చంపడం అంటే దేశ సంపదని కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పే కుట్రలో భాగమే అన్నారు. జార?ండ్ లాంటి రాష్ట్రాలలో వేలకొద్ది ఆదివాసీలను జైళ్ళలో నిర్బంధిస్తున్నారని, ఆయుదాలు పట్టుకున్న పేరుతో విప్లవ కారులతో ప్రబుత్వం చర్చలు జరపడం లేదని కానీ , ఆయుధాలు పట్టుకున్న సంస్థలతో ప్రబుత్వలు గతంలో చాలా చర్చలు జరిపాయి అని అన్నారు. కానీ ఆదివాసీలను, అడివిని నిర్మూలించడానికే మావోయిస్టు లతో చర్చలు జరపడం లేదని అన్నారు. ప్రభుత్వం జవాబుదారిగా కాకుండా ఆర్ఎస్ఎస్ బంటులాగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఒకపక్క సుప్రీం కోర్టు ప్రజలను చంపే హక్కు లేదంటుంటే ప్రభుత్వాలు మాత్రం కగార్ పేరుతో హత్య ఖండను కొనసాగిస్తున్నాయాని, ఆపరేషన్ కగర్ ని నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణాలో కాల్పుల విరమణ- ఆవశ్యకత :

ఈ సెషన్ కు విరసం కార్యవర్గ సభ్యుడు పాణి అధ్యక్షత వహించారు. మావోయిస్టులు సమాజ అవసరాన్ని, ప్రజల అవసరాన్ని గుర్తించారు కాబట్టి చర్చల ప్రతిపాదన చేశారని అన్నారు. ప్రభుత్వాలు కూడా రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించి చర్చలకు ముందుకు రావాలని అన్నారు. ప్రొ. రమా మెల్కోటే మాట్లాడుతూ చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఒక మూహోరటం పెట్టుకుని మనుషలను చంపడం రాజ్యాంగ వ్యతిరేకం అని అన్నారు. మనుషలను చంపేసి వనరులను కార్పొరేట్లకు ఇస్తే ఏమి మిగులుతుంది అని అన్నారు. అంబటి నాగయ్య మాట్లాడుతూ రాజ్యాంగమే ప్రాతిపదికగా సామజిక పరివర్తన దాని లక్ష్యం అని అన్నారు. తెలంగాణకు విస్తరించే ఉద్దేశంతోనే అమిత్ షా తెలంగాణ సమాజాన్ని శతృవుగా భవించారని అన్నారు, ఫెడరల్ సభావాన్ని చంపిండే వీళ్ళని బంధి పోట్లుగా రాష్ట్రాలని దోచుకుంటున్నారని అన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ షెడ్యూల్డ్ 5 అనేది స్వయంప్రతిపత్తి కలిగి ఉందని, అలాంటి వాటికి ప్రత్యక చట్టాలు ఇస్తూ ఉన్నవాటిని గౌరవించాలని అన్నారు, బస్టర్ లో శాంతి బద్రతలకు పేరుతో హింస జరుగుతుందని ,ప్రజలను వెల్లగొట్టి గ్రామాలను తరిమేస్తున్నారని ప్రజలు శాంతిగా బ్రతికే అవకాశాలు కోల్పోయారని ఇలాంటి సందర్భంలో శాంతి చర్చలు జరపలని ఆయన డిమాండ్ చేశారు . విరసం కార్యవర్గ సభ్యుడు పాణి మాట్లాడుతూ తెలంగాణలో కాల్పుల విరమణ తొలిదశలోనే ఉందని జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం, మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం తో పని చేస్తున్నాయని అన్నారు,తెలంగాణలో ప్రజా స్వామ్యానికి ఈ కాల్పుల విరమణ ప్రక్రియ ఎలా మేలు చేస్తుందని ఆలోచించాలని అన్నారు. పోటు రంగరామ మాట్లాడుతూ తెలంగాణలో కాల్పుల విరమణ డిమాండ్ చేస్తున్న సందర్బంలో ప్రభుత్వం కాల్పుల విరమణ చేపట్టాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేనంత విదంగా కార్పొరేట్ శక్తుల కోసం ప్రభుత్వాలు ప్రయత్నిస్తూ ఆదివాసీలను హత్య చేస్తున్నారని అన్నారు.. సాదినేని వెంకటేశ్వరావ్ : పంచాయత్ రాజ్ చట్టాలను ప్రభుత్వాలు ఉల్లంగిస్తూ ఆదివాసిల హక్కులను కాలరాస్తున్నారని,భూమాలను దోచుకుంటూ అడివిని దోచుకుంటున్నారని అన్నారు, ప్రశ్నిస్తున్న వారిపై నిర్బంధాలు విదిస్తూ జైళ్ళలో పెడుతున్నారని, ఆపరేషన్ కగర్ పేరు మిద హత్య ఖండను కొనసాగిస్తున్నారని అన్నారు, పంచాయత్ రాజ్ చట్టాలను గౌరవిస్తూ ఆదివాసిలకు అడివిపై సంపూర్ణ హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్: తెలంగాణ సాహిత్యంపై విరసం చేదిరిపోని ముద్ర వేసింది, తెలంగాణలో ఉండే చైతన్యం ఎక్కడ లేదు , 2004 లో మరియు ఇప్పుడు శాంతి చర్చలకు తెలంగాణ ప్రయత్నం చేస్తుందాని అన్నారు, తెలంగాణ ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతుందని, శాంతి చర్చలను ఆహ్వానిస్తున్నాం అని ముఖ్యమంత్రి అన్నారని అన్నారు, పోలీస్ యంత్రాంగం వల్లే శాంతి చర్చలు విఫలం అవుతున్నాయని అన్నారు, ప్రభుత్వాలు చర్చల సంధర్బంలో ద్వంద వైకరి చూపిస్తున్నాయని అన్నారు, మావోయిస్టుల డిమాండ్ అంతా ప్రజల కనీస అవసరాల చుట్టే తిరుతాయి అని అవి గౌరవించి ఆదివాసీలను, దేశ పౌరులను చంపడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## చిన్న బెల్లం ముక్కను నెయ్యితో కలిపి తినండి.. జరిగే అద్భుతాలు చూడండి..!



ఆయుర్వేద ప్రకారం నెయ్యి ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఆయుర్వేదంలో పలు కర్మ చికిత్సలను నిర్వహించడంలో నెయ్యి ముఖ్య పాత్ర పోషిస్తుంది. నెయ్యిలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. అయితే నెయ్యిని బెల్లంతో కలిపి తింటే అనేక లాభాలు ఉంటాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. బెల్లంలోనూ అనేక పోషకాలు ఉంటాయి. కనుక ఈ రెండింటి కాంబినేషన్ మనకు అనేక లాభాలను ఇస్తుందని వారు అంటున్నారు. బెల్లం ముక్కను నెయ్యితో కలిపి రోజూ ఉదయాన్నే పరగడుపునే తినాల్సి ఉంటుంది. దీంతో పలు వ్యాధుల నుంచి బయట పడవచ్చు. అలాగే శరీరానికి అమితమైన పోషణ లభిస్తుంది. బలం కలుగుతుంది. ఆరోగ్యంగా ఉంటారు. ఇక ఈ మిశ్రమం వల్ల కలిగే లాభాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.

**సహజసిద్ధంగా క్లీన్..**

బెల్లం, నెయ్యి రెండింటి మిశ్రమాన్ని తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఈ మిశ్రమం జీర్ణాశయ ఎంజైమ్‌లను ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. ముఖ్యంగా భోజనం చేసిన తరువాత వచ్చే గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. మలబద్దకం సైతం తగ్గిపోతుంది. ఈ రెండింటి మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల ఆహారం సులభంగా జీర్ణం అవడమే కాక అందులో ఉండే పోషకాలను కూడా శరీరం సులభంగా శోషించుకుంటుంది. నెయ్యి, బెల్లం మిశ్రమం సహజసిద్ధమైన డిటాక్సిఫై ఏజెంట్‌గా పనిచేస్తుంది. అంటే ఈ మిశ్రమాన్ని తింటే శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోయి శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుందన్నమాట. దీంతోపాటు లివర్, కిడ్నీలు, రక్తం అన్నీ శుభ్రమవుతాయి. ఆయా భాగాల్లో ఉండే టాక్సిన్లు సులభంగా బయటకు వెళ్లి ఆరోగ్యం కలుగుతుంది.

**హార్మోన్ల అసమతుల్యతకు..**

నెయ్యి, బెల్లం మిశ్రమాన్ని ఉదయం తినడం వల్ల చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. రోజంతా శరీరంలో శక్తి స్థాయిలు అలాగే ఉంటాయి. అసలు అలసట, నీరసం రావు. ఈ మిశ్రమాన్ని తినడం వల్ల శరీర మెటబాలిజం సైతం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. పోషకాహార లోపం ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తింటుంటే ఫలితం ఉంటుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో పోషకాహార లోపం తగ్గిపోతుంది. హార్మోన్ల అసమతుల్యత ఉన్నవారు ఈ రెండింటి మిశ్రమాన్ని తింటుంటే హార్మోన్ల ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. శరీర ఉష్ణోగ్రత సైతం నియంత్రణలో ఉంటుంది.

**ఎముకల దృఢత్వానికి..**

బెల్లం, నెయ్యి మిశ్రమాన్ని తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో జంక్ ఫుడ్, అధిక ఆహారం తినకుండా జాగ్రత్త పడవచ్చు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అసిడిటీ, అజీర్తి సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తింటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఆయా సమస్యల నుంచి బయట పడవచ్చు. ఈ రెండింటి మిశ్రమంలో విటమిన్ కె ఉంటుంది. ఇది ఎముకలను బలంగా మారుస్తుంది. మనం తిన్న ఆహారంలో ఉండే క్యాల్షియంను శరీరం సరిగ్గా శోషించుకునేలా చేస్తుంది. దీంతో ఎముకలకు బలం కలుగుతుంది. ఇలా బెల్లం, నెయ్యి మిశ్రమం మనకు అనేక లాభాలను అందిస్తుంది. కనుక దీన్ని రోజూ